క్లుప్తంగా

కొనసాగుతున్న గురువైభవోత్సవాలు



స్వామి వారి పూజల్లో పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు

మంత్రాలయం: మంత్రాలయంలో రాఘవేంద్ర స్వామి గురువైభవోత్సవాలు గురువారంతో నాల్గవ రోజుకు చేరాయి. వేడుకల్లో భాగంగా పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు నేతృత్వంలో రాఘవేంద్రుల మూలబృందావనానికి ప్రత్యేక పూజలు గావించారు. అలాగే రాములోరి పూజలో తరించారు. యోగీంద్ర మండపంలో పలువురు ప్రముఖులకు అవార్డులు ప్రదానం చేశారు. విద్వాన్ రవిశంకర అవధానికి, విద్వాన్ నాగేశ్వర శర్మకు అవార్డులు అందజేశారు. ఏఏఓ మాధవ శెట్టి, మేనేజర్లు పాల్గొన్నారు.

విస్తృతంగా వాహనాల తనిఖీ



వాహనాన్ని తనిఖీ చేస్తున్న తాలూకా సీఐ

ఆదోనిరూరల్: త్వరలో జరగబోయే సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు, అక్రమ రవాణా జరగకుండా ముందస్తుగా వాహనాల తనిఖీ చేపట్టినట్లు ఆదోని తాలూకా సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. గురువారం సాయంత్రం ఆదోని-ఎమ్మిగనూరు ప్రధాన రహదారిలోని నెట్టేకల్ క్రాస్ రోడ్డు ఆంజనేయస్వామి 48 అడుగుల విగ్రహం వద్ద వాహనాల తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా అనుమానిత వస్తువులు, రికార్డులు, ట్రాఫిక్ రూల్స్ పాటించని వాహన దారులకు జరిమానా విధించారు.

దర్గాకు పోటెత్తిన భక్తులు



పూజలందుకుంటున్న ఖాదర్‌లింగ స్వామి

కౌతాళం: కౌతాళంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలుగొందుతున్న జగద్గురు ఖాదర్ లింగ స్వామి దర్గాకు గురువారం భక్తులు తరలివచ్చి స్వామి సన్నిధిలో భక్తిశ్రద్ధలతో ఫాతెహాలు, ప్రార్థనలు చేశారు. దర్గా పరిసర ప్రాంతాలన్ని భక్తులతో సందడిగా మారాయి. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు స్వామి వారికి మొక్కులు తీర్చుకున్నారు. తెల్లవారుజామున ఐదు గంటలకు దర్గా ధర్మకర్త సయ్యద్ మున్నపాషా చిష్తీ, పీఠాధిపతి ఖాదర్ బాష చిష్తీలు స్వామి సమాధికి గంధం పూసి ప్రత్యేక ఫాతేహాలు చేపట్టారు. కొందరు భక్తులు పిండివంటలు వండి స్వామికి నైవేద్యం సమర్పించారు.


పరీక్షల విధుల నుంచి మినహాయింపునివ్వాలి



ఎంఈఓకు వినతి పత్రం ఇస్తున్న ఎస్టీయూ నాయకులు

ఆదోని సెంట్రల్: పదవ తరగతి పరీక్షల విధుల నుంచి కొందరికి మినహాయింపు ఇవ్వాలని ఎస్టీయూ మండల అధ్యక్ష, కార్యదర్శులు రామ కృష్ణ, సుధాకర్ బాబు కోరారు. ఈ మేరకు గురువారం ఎంఈఓ-2 శ్రీనివాసులును కలసి వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ గర్భిణులు, చంటి పిల్లలు కలిగిన ఉపాధ్యాయినులతో పాటు దివ్యాంగులు, త్వరలో పదవీవిరమణ పొందే ఉపాధ్యాయులకు కూడా మినహాయింపు ఇవ్వాలన్నారు. ఎంఈఓ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళతామని చెప్పారు. నాయకులు ఎం.సి.సుంకన్న, బి గోపాల్, రామాంజనేయులు, సూర్యుడు, ప్రభన్న, మనోహర్, రామాంజనేయులు పాల్గొన్నారు.

సిమెంటు రోడ్డు నిర్మాణానికి భూమి పూజ



భూమి పూజ చేస్తున్న నాయకులు

కౌతాళం: మండల పరిధిలోని కుంబళనూరు క్యాంపు-2లో సిమెంటు రోడ్డు పనులకు భూమి పూజ చేపట్టారు. ఈ మేరకు క్యాంపు వైఎస్సార్‌సీపీ నాయకులు బుచ్చయ్య, అనిల్ కుమార్, చక్రవర్తి మాట్లాడుతూ.. క్యాంపులోని మొయిన్ రోడ్డు నుంచి ప్రాథమిక పాఠశాల వరకు సిమెంటు రోడ్డు నిర్మాణానికి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిధులు రూ.7 లక్షలు మంజూరు కావడంతో గురువారం భూమి పూజ చేపట్టామన్నారు. గ్రామంలోని ప్రధాన వీధుల్లో సిమెంట్ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం చేపడుతున్నట్లు వారు తెలిపారు. స్థానిక నాయకులు పాల్గొన్నారు.

చేతివృత్తులకు చేదోడు

- జగనన్న చేదోడు పథకం కింద ఏటా 1,629 మందికి ఆర్థిక సాయం
- ఆర్థికంగా నిలదొక్కుకున్న కుటుంబాలు
- సంతోషం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు

పెరిగిన అక్షరాస్యత.. విస్తరించిన ఉద్యోగ అవకాశాలు.. మారిన బతుకులు.. అయినా నేటికీ ఎంతోమంది కులవృత్తులపైనే జీవనం.. చాలీచాలని సంపాదన.. ఫలితంగా దారిద్ర్య రేఖకు దిగువనే ఆ కుటుంబాలు.. సమస్యను గుర్తించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాదయాత్రలో ఇచ్చిన మాట కోసం వారికి ఆర్థిక చేయూతనిచ్చి అండగా నిలవాలని సంకల్పించారు. చేతి వృత్తులనే నమ్ముకున్న వారి కోసం జగనన్న చేదోడు పథకం అమలు చేసి వారికి తోడుగా నిలిచారు. దీంతో వారంతా ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

ఆదోనిఅర్బన్: సమాజంలో కులవృత్తులకు అధిక ప్రాధాన్యతనిస్తూ వారికి అండగా నిలవాలని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం జగనన్న చేదోడు పథకాన్ని అమలు చేసింది. దీంతో ఆదోని నియోజకవర్గంలోని రజక, నాయిబ్రాహ్మణ, దర్జీలకు ఏటా అక్టోబర్ నెలలో రూ.10 వేల ఆర్థిక సాయాన్ని నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోకి జమ చేస్తుంది. నియోజకవర్గంలో ఇప్పటివరకు 1,629 మంది లబ్ధిదారుల ఖాతాల్లో రూ.10 వేలు చొప్పున రూ.16.29 కోట్లు జమ చేసింది. ఈ నగదుతో వారు తమ వృత్తులను మరింత మెరుగుపరుచుకోవడంతో కుటుంబాల్లో వెలుగులు నిండాయి.



బట్టలకు ఇస్త్రీ పెడుతున్న దృశ్యం



సెలూన్‌లో వ్యక్తికి కటింగ్ చేస్తున్న కులవృత్తుడు

ఏటా కొత్తగా దరఖాస్తులు..

ఏటా 200 మందికి పైగా కొత్తగా దరఖాస్తు చేసుకుని లబ్ధి పొందుతున్నారు. 21-60 ఏళ్ల మధ్య వయస్సు ఉండి దుకాణాలు పెట్టుకున్న వారు ప్రభుత్వం నిర్దేశించిన ధ్రువపత్రాలను సచివాలయాల ద్వారా అందించి పథకాన్ని పొందుతున్నారు. ఇందుకు సంబంధించి సచివాలయ సిబ్బంది వెరిఫికేషన్ చేయిస్తూ పారదర్శకంగా అర్హులైన ప్రతిఒక్కరికీ వర్తింపజేస్తున్నారు.

దుకాణాభివృద్ధికి వినియోగించా



నేను టీజీఎల్ కాలనీలో ధోబీ దుకాణం పెట్టుకుని కుటుంబాన్ని పోషించుకుంటున్నా. జగనన్న చేదోడు ద్వారా ఏటా అందే రూ.10 వేలతో దుకాణాభివృద్ధికి వినియోగించా. ఇప్పుడు వ్యాపారం బాగా ఉంది. మాలాంటి కులవృత్తుల వారికి అండగా నిలిచింది. మళ్లీ జగనన్న సీఎం కావాలి, మాలాంటి మరింత మంది పేదల జీవితాల్లో వెలుగులు నింపాలి. – నాగప్ప, ధోబీ, ఆదోని

దుకాణం కోసం చేసిన అప్పు తీర్చా



పట్టణంలోని వైఎంకే కాలనీలో సెలూన్‌షాపు పెట్టుకునేందుకు అప్పు చేశా. వివిధ పథకాల సొమ్ముతో పాటు జగనన్న చేదోడు సొమ్ము, సొంతంగా కొంత జమ చేసుకొని అప్పు చెల్లించాను. ఇప్పుడు దుకాణం నా సొంతమైంది. ప్రస్తుతం ఏ ఇబ్బందులు లేవు. దుకాణాన్ని అభివృద్ధి చేస్తున్నా. ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకానికి కృతజ్ఞతలు. – గోవింద్, సెలూన్‌షాప్, ఆదోని

జగనన్న ప్రోత్సాహం మరువలేనిది



విక్టోరియాపేటలో చిన్న డబ్బా పెట్టుకుని ఇస్త్రీ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నా. పాత ఇస్త్రీ పెట్టితో ఇబ్బందులు ఉండేవి. జగనన్న చేదోడు ద్వారా కొత్త ఇస్త్రీ పెట్టె కొన్నా. విడతల వారీగా అందే సొమ్ముతో దుకాణానికి మరమ్మతులు చేయించుకున్నా. మాలాంటి వారికి ఇలాంటి సాయం చేయడం సంతోషంగా ఉంది. మరింత మంది పేద ప్రజలు బాగుపడాలంటే మళ్లీ జగనన్న రావాల్సిందే. – శ్రీనివాసులు, దోబీ ఆదోని

మహిళ మెడలో చైన్ చోరీ

ఆదోనిఅర్బన్: పట్టణ శివారులోని మండిగిరి కాలనీలో గురువారం తెల్లవారుజామున గుర్తుతెలియన ఆగంతకుడు ఇంట్లోకి దూరి లలితమ్మ అనే మహిళ గొంతులో ఉన్న బంగారు చైన్‌ను లాక్కెళ్లిన సంఘటన చోటు చేసుకుంది. బాధితురాలి ఫిర్యాదు మేరకు టూటౌన్ సీఐ గోపీచంద్ తెలిపిన వివరాలు.. మండిగిరి కాలనీలో గురువారం తెల్లవారుజామున 4;30 గంటల సమయంలో గుర్తు తెలియని దుండగుడు ఇంట్లో దూరి లలితమ్మ అనే మహిళ మెడలోని 2.9 తులాల బంగారు చైన్‌ను లాక్కొని పారిపోయాడన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ చెప్పారు.

మిఠాయి దుకాణంలో అగ్ని ప్రమాదం



అగ్ని ప్రమాదంలో కాలిపోయిన దుకాణం

ఆదోనిఅర్బన్: స్థానిక చిన్నమార్కెట్‌లో మిఠాయి దుకాణంలో గురువారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ప్రమాదవశాత్తు అగ్ని ప్రమాదం చోటు చేసుకోవడంతో మిఠాయి దుకాణంలో ఉన్న మిషనరీలు, సామగ్రి కాలిపోయాయని దుకాణదారుడు ఇస్మాయిల్ తెలిపారు. దాదాపు రూ.10 లక్షల మేర ఆస్తి నష్టం కలిగి ఉంటుందని అగ్నిమాపక శాఖ అధికారులు చెప్పారు. అగ్ని ప్రమాదం ప్రారంభమైన వెంటనే స్థానికులు ఫైర్ అధికారులకు సమాచారం ఇవ్వడంతో సిబ్బంది వచ్చి మంటలను ఆర్పి వేశారు.

తాగునీటి ఎద్దడి రానివ్వం

పెద్దకడబూరు: మండలంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకున్నట్లు వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తంరెడ్డి, మండలాధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణంలో 60 వేల లీటర్ల నీటి సామర్థ్యంతో ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకు నిర్మాణానికి ఎంపీపీ శ్రీవిద్య, జెడ్పీటీసీ రాజేశ్వరి ఆధ్వర్యంలో గురువారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలో తాగునీటి సమస్యను పరిష్కరించేందుకు జలజీవన్ మిషన్ కింద 1.10 కోట్ల నిధులు మంజూరయ్యాయన్నారు. ఈ నిధులతో పాఠశాల, బీసీ హాస్టల్, ఆస్పత్రి, ఎస్సీ కాలనీలో ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకులను ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. మిగతా డబ్బుతో బీసీ కాలనీలో 1.20 లక్షల నీటి సామర్థ్యంతో ఓహెచ్‌ఎస్‌ఆర్ ట్యాంకు నిర్మించేందుకు స్థలం సేకరిస్తున్నట్లు పేర్కొన్నారు. మిగతా సొమ్మును తాగునీటి పైప్‌లైన్ ఏర్పాటుకు ఉపయోగించి పెద్దకడబూరులో తాగునీటి సమస్య లేకుండా చూస్తామన్నారు. సర్పంచ్ రామాంజినేయులు, జేసీఎస్ కన్వీనర్ రవిచంద్రరెడ్డి, నాయకులు రఘురాముడు, నాయకులు గజేంద్రరెడ్డి, శివరామిరెడ్డి, ముక్కరన్న, హెచ్ఎం రాజేశ్వరి పాల్గొన్నారు.

నివాళి



తన తల్లి ఎల్లారెడ్డి లలితమ్మ పార్థివదేహం వద్ద ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి, నాయకులు



లలితమ్మ (ఫైల్)

ఆదోని టౌన్: ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి మాతృమూర్తి లలితమ్మ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించేందుకు గురువారం వివిధ రాజకీయ పార్టీల నాయకులు, అధికారులు, కౌన్సిలర్లు, ప్రజా ప్రతినిధులు తరలివచ్చారు. స్థానిక ఎమ్మెల్యే ఇంటి వద్దకు సచివాలయ ఉద్యోగులు, వ్యాపారవేత్తలు, పోలీసు ఉన్నతాధికారులు వచ్చి సంతాపం వ్యక్తం చేశారు. ఎమ్మెల్యేలు సాయిప్రసాద్‌రెడ్డి, బాలనాగిరెడ్డి, వెంకటరామిరెడ్డితో పాటు మనోజ్‌కుమార్‌రెడ్డితో మాట్లాడి సానుభూతిని వ్యక్తం చేశారు. కాగా.. బుధవారం రాత్రి ఆదోనిలోని మధు ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతిచెందిన ఎల్లారెడ్డి లలితమ్మ పార్థివదేహాన్ని ఎమ్మెల్యే సాయిప్రసాద్‌రెడ్డి నివాసంలో ప్రజల సందర్శనార్థం ఉంచారు. గురువారం ఉదయం ఆమె అంత్యక్రియల కోసం వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామానికి ప్రత్యేక అంబులెన్స్‌లో తరలించారు.

శోకసంద్రంలో బదినేహాల్

కౌతాళం: రాంపురం రెడ్డి సోదరుల మాతృమూర్తి లలితమ్మ మృతి పట్ల మండల పరిధిలోని బదినేహాల్ గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. లలితమ్మ పుట్టినిల్లు బదినేహాల్ గ్రామం కావడంతో గ్రామ ప్రజలు ఆమె మరణవార్త విని కన్నీరు మున్నీరయ్యారు. లలితమ్మ భర్త భీమారెడ్డి రాజకీయ రంగప్రవేశం చేసి ఎమ్మెల్యే సేవలందించారు. వారి పుత్రులైన సాయిప్రసాద్‌రెడ్డి ఆదోని ఎమ్మెల్యేగా, వెంకటరామిరెడ్డి గుంతకల్ ఎమ్మెల్యేగా, వై.బాలనాగిరెడ్డి మంత్రాలయం ఎమ్మెల్యేగా శివరామిరెడ్డి అనంతపురం జిల్లా నుంచి ఎమ్మెల్సీగా, సీతారామిరెడ్డి తిరుమల దేవస్థానం ట్రస్టుబోర్డు మెంబర్‌గా కొనసాగుతున్నారు. ఒకే కుటుంబంలో ముగ్గురు ఎమ్మెల్యేలు, ఒకరు ఎమ్మెల్సీ, ఒకరు తిరుమల తిరుపతి దేవస్థానం మెంబర్‌గా ఉండడం గమనార్హం. కుమారులు కర్నూలు, అనంతపురం జిల్లాల్లో మంచి నాయకులుగా ఎదిగేందుకు మాతృమూర్తి లలితమ్మ ఎంతగానో కృషి చేశారు. ఆమె జ్ఞాపకాలను తలుచుకుంటూ పుట్టినిల్లు బదినేహాల్ ప్రజలు శోకసంద్రంలో మునిగారు. ఆమె మృతి పట్ల సీనియర్ నాయకులు లక్ష్మిరెడ్డి, వీరభద్రగౌడ్, జిల్లా ప్రధాన కార్యదర్శి అత్రితనయ గౌడ్, కో-ఆప్షన్ మెంబర్ మహబుబ్‌సాబ్ ప్రగాఢ సానుభూతి తెలిపారు.

చేయూతతో ఆర్థిక భరోసా



పొదుపు మహిళలకు మెగా చెక్కు అందజేస్తున్న ఎంపీపీ శ్రీవిద్య, జెడ్పీటీసీ రాజేశ్వరి తదితరులు



వలంటీర్లకు పురస్కారాలు అందిస్తున్న ప్రజాప్రతినిధులు

పెద్దకడబూరు: ప్రజాసంక్షేమం కోసం తపించే పార్టీ వైఎస్సార్‌సీపీ అని, ఎన్నికల సమయంలో మహిళలకు పసుపు కుంకుమ వంటి పథకాలు ఇచ్చి చేతులు దులుపుకునే పార్టీ కాదని వైఎస్సార్‌సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి పురుషోత్తం రెడ్డి, మండలాధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ చంద్రశేఖర్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ రవి చంద్రరెడ్డి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ శ్రీవిద్య, జెడ్పీటీసీ రాజేశ్వరి ఆధ్వర్యంలో ఐకేపీ మండల కో-ఆర్డినేటర్ జనార్దన్ అధ్యక్షతన లబ్ధిదారులకు వైఎస్సార్ చేయూత మెగా చెక్కును అందజేశారు. ముందుగా ఎమ్మెల్యే వై.బాలనాగిరెడ్డి మాతృమూర్తి లలితమ్మ (80) మృతికి సంతాపం తెలుపుతూ ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. వైఎస్సార్ చేయూత కింద 4వ విడతలో 3399 మంది సభ్యులకు రూ. 6.37 కోట్లు లబ్ధిదారుల ఖాతాలో జమ అయ్యాయన్నారు. మొత్తం నాలుగు విడతల్లో రూ.23.46 కోట్లు లబ్ధిదారులకు అందించినట్లు వివరించారు. అదేవిధంగా వైఎస్సార్ ఆసరా కింద 4వ విడతలో 686 పొదుపు సంఘాల్లోని 6850 మంది పొదుపు మహిళలకు రూ.10.73 కోట్లు జమ అయ్యాయన్నారు. ఇలాంటి పథకాలు కొనసాగాలంటే మరోసారి వైఎస్సార్ ప్రభుత్వమే అధికారంలోకి రావాలన్నారు. అనంతరం వలంటీర్ల సేవలను కొనియాడుతూ వారిని శాలువాలతో సత్కరించి పురస్కార పత్రాలను అందజేశారు. పొదుపు మహిళ త్రివేణి ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. కార్యక్రమంలో ఎంపీడీఓ ప్రభాకర్, ఈఓపీఆర్డీ జనార్దన్, సర్పంచ్ రామాంజనేయులు, నాయకులు రఘురాముడు, శివరామిరెడ్డి, రాజశేఖర్ రెడ్డి, అర్లప్ప, ముక్కరన్న, ఏపీఎం సూర్యప్రకాష్, వెలుగు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి రుణపడి ఉంటాం

మా కుటుంబమంతా ప్రభుత్వానికి రుణపడి ఉంటుంది. జగనన్న పాలనలో వైఎస్సార్ ఆసరా, రైతు భరోసా, మా అవ్వకు పింఛన్ అందుతోంది. తోడికోడలికి చేయూత సాయం, ఆమె కుమారుడికి ఫీజు రీయింబర్స్‌మెంట్, మరో తోడికోడలు కూతురు ఊహ(4) కు తిరుపతిలోని ప్రైవేట్ ఆస్పత్రిలో గుండె శస్త్రచికిత్స జరిగింది. ఇన్ని పథకాల ద్వారా లబ్ధి పొందిన మా కుటుంబం సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఎన్నడూ మరువదు.

– త్రివేణి, పొదుపు మహిళ

పౌష్టికాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

పెద్దకడబూరు: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందిస్తున్న పౌష్టికాహారాన్ని బాలింతలు, గర్భిణులు సద్వినియోగం చేసుకోవాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ విజయకుమారి సూచించారు. మండల పరిధిలోని హెచ్.మురవణి గ్రామం అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ పక్వాడ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. గర్భిణులు, బాలింతలకు చిరుధాన్యాల వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాల గురించి వివరించారు. పిల్లలు, స్త్రీలలో పోషకాహార లోపం, రక్తహీనత లక్షణాలను ఎలా గుర్తించాలి, నివారణ చర్యలపై అంగన్‌వాడీ కార్యకర్తలకు అవగాహన కల్పించారు. అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

బీజేపీ టికెట్ విట్టా రమేష్‌కే ఇవ్వాలి

ఆదోనిటౌన్: త్వరలో జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఆదోని ఎమ్మెల్యే స్థానానికి బీజేపీ నుంచి పారిశ్రామికవేత్త విట్టా రమేష్‌కే ఇవ్వాలని ఆర్యవైశ్యులు బీజేపీ అధిష్టానాన్ని అభ్యర్థించారు. గురువారం స్థానిక భీమాస్ ఫంక్షన్ హాల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు మిర్యాల బద్రీనాథ్, పట్టణాధ్యక్షుడు వి.టి.ప్రకాష్, మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు మిర్యాల డాక్టర్ వనిత మాట్లాడారు. టీడీపీ, జనసేన, బీజేపీ మూడు పార్టీల మధ్య పొత్తులో భాగంగా ఆదోని సీటును బీజేపీకి కేటాయించారని, అయితే బీజేపీ తరఫున ఆదోని ఎమ్మెల్యే స్థానాన్ని విట్టా రమేష్‌కు కేటాయించాలని కోరారు. పరిమళ, మెదేహాల్ శ్రీధర్, ప్రతాప్ ఈరన్న శెట్టి, వినోద్‌కుమార్, నారాయణ, పాడేగల్ సునాథ్ కుమార్, బింగి మనోహర్ పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ వైఖరిపై నిరసన



పెద్దకడబూరులో వామపక్షాల ఆధ్వర్యంలో ధర్నా

పెద్దకడబూరు: కేంద్ర ప్రభుత్వ మొండి వైఖరి నశించాలని వామపక్ష నాయకులు భాస్కర్‌యాదవ్, తిక్కన్న, పరమేష్, వీరేష్ డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వ తీరుకు నిరసనగా ఢిల్లీలో రైతుల ఆందోళనకు మద్దతు తెలుపుతూ రైతు సంఘం (ఏఐకేఎస్) ఆధ్వర్యంలో గురువారం స్థానిక బస్టాండ్ ఆవరణలో ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం 2021 డిసెంబర్‌లో రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలుపరచాలని కోరుతూ ఢిల్లీ బయలుదేరిన రైతన్నలను హర్యానా సరిహద్దుల్లోనే అడ్డగించడం, వారిపై విష వాయువు ప్రయోగించడం దుర్మార్గమైన చర్యలు అని మండిపడ్డారు. రైతులకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుండా తప్పుడు దారిలో వెళుతున్న బీజేపీ ప్రభుత్వానికి ప్రజలు బుద్ధి చెప్పేరోజులు దగ్గర పడ్డాయన్నారు. స్వామినాథన్ కమిటీ సిఫారసు ప్రకారం 50 శాతం అధిక మద్దతు ధరల చట్టం చేయాలని, ఉపాధి హామీ పథకానికి కేంద్ర బడ్జెట్‌లో రెండు లక్షల కోట్లు కేటాయించి కూలీలకు 200 రోజులు పనిదినాలు కల్పించాలన్నారు. పోలవరం ప్రాజెక్టుకు నిధులు కేటాయించాలన్నారు. నాయకులు ఆంజనేయ, చంద్ర, తిక్కన్న, నాగరాజు, వీరేష్, కుంటెన్న, శ్రీరాములు, దస్తగిరి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు అర్థమయ్యేలా బోధించాలి



ఉపాధ్యాయుల సమావేశంలో మాట్లాడుతున్న ఎంఈఓ రామమూర్తి

పెద్దకడబూరు: ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటుకు దీటుగా తీర్చిదిద్దాలని ఎంఈఓలు సువర్ణల సునీయం, రామమూర్తి సూచించారు. యాన్యువల్ ఇన్‌స్పెక్షన్‌లో భాగంగా మండల పరిధిలోని కంబదహాల్ ప్రాథమికోన్నత పాఠశాలను వారు గురువారం సందర్శించారు. ముందుగా పాఠశాల రికార్డులు, రిజిస్టర్లను తనిఖీ చేశారు. ఉపాధ్యాయుల హాజరు, బోధన పద్ధతులను పరిశీలించారు. ఉపాధ్యాయుల లెసన్ ప్లాన్స్, టీచర్ డైరీలను తిరగవేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమావేశమయ్యారు. వారు మాట్లాడుతూ.. పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరు కావాలన్నారు. విద్యార్థులకు అర్థమయ్యేలా సులభమైన పద్ధతిలో బోధన ఉండేలా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. వంట ఏజెన్సీ వారితో మాట్లాడి మెనూ ప్రకారం భోజనం వడ్డించాలని లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉపాధ్యాయులు ఉన్నారు.

నేటి నుంచి బడేసాహెబ్ స్వామి ఉరుసు

గోనెగండ్ల: భక్తుల పాలిట కొంగు బంగారం గంజిహళ్లి బడేసాహెబ్ స్వామి ఉరుసు శుక్రవారం నుంచి ఘనంగా నిర్వహించనున్నారు. 15న స్వామివారి గంధం, 16న ఉరుసు, 17న జియారత్ కార్యక్రమాలు ఉంటాయని నిర్వాహకులు తెలిపారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశామని, గ్రామానికి చేరుకునేందుకు ఎమ్మిగనూరు, గోనెగండ్ల నుంచి ప్రత్యేక బస్సులను నడుపుతున్నట్లు వెల్లడించారు.

హామీలు అమలు చేయాలి



ఆదోనిలో ర్యాలీగా వెళ్తున్న ప్రజా సంఘాల నాయకులు

ఆదోనిరూరల్: కేంద్రంలోని బీజేపీ ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రైతు, కార్మిక సంఘాల, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఢిల్లీలో 540 రైతు సంఘాలతో కూడిన సంయుక్త కిసాన్ మోర్చా తలపెట్టిన బహిరంగ సభను జయప్రదం కావాలని గురువారం స్థానిక మున్సిపల్ గ్రౌండ్ నుంచి అంబేడ్కర్ విగ్రహం, పొట్టి శ్రీరాములు సర్కిల్ వరకు ప్రదర్శన చేపట్టారు. అనంతరం సీఐటీయూ పట్టణ కార్యదర్శి పి.ఎస్.గోపాల్, ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి బి.వెంకన్న అధ్యక్షతన జరిగిన సభలో రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు బి.వెంకటేశులు, రైతు కూలీ సంఘం జిల్లా నాయకులు మల్లికార్జున, రైతు సంఘం మండలాధ్యక్షుడు నరసప్ప, సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు పి.ఈరన్న, పట్టణ సీనియర్ నాయకులు బి.మహానంద్‌రెడ్డి, ఏఐటీయూసీ జిల్లా సమితి సభ్యుడు కల్లుబావిరాజు, ప్రగతి మహిళా సంఘం జిల్లా నాయకురాలు మణెమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కె.లింగన్న మాట్లాడారు. బీజేపీ అనుసరిస్తున్న విధానాలకు వ్యతిరేకంగా ఢిల్లీలోని నగరం రామ్‌లీలా మైదానంలో రైతు సంఘాల ఆధ్వర్యంలో లక్షలాది మందితో బహిరంగ సభను జయప్రదం చేయడంపై హర్షం వ్యక్తం చేశారు.

రమణీయం.. గంగాభవాని రథోత్సవం




బాపురంలో అశేష భక్తజనం మధ్య కదులుతున్న రథం

పెద్దకడబూరు: మండల పరిధిలోని చిన్నతుంబళం పంచాయతీ మజారా గ్రామం బాపురంలో వెలసిన శ్రీ గంగాభవాని అమ్మవారి రథోత్సవం గురువారం రమణీయంగా సాగింది. తెల్లవారుజాము నుంచి ఆలయ అర్చకులు అమ్మవారికి మహాగణపతిపూజ, గంగ పూజ, ఆకుపూజ, కుంకుమార్చన, తులసి ఆర్చన, పుష్పార్చన, పంచామృతాభిషేకం, మహా మంగళ హారతి వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. రథోత్సవం పురస్కరించుకొని గ్రామంతో పాటు చుట్టుపక్కల గ్రామాలు చిన్నతుంబళం, హులికన్వి, బసలదొడ్డి, కల్లుకుంట, ముచ్చగిరి, నాగులాపురం, సింగరాజనహళ్లి తదితర గ్రామాల నుంచి ప్రజలు పిండి వంటలు చేసి అమ్మవారికి నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. సాయంత్రం ఉప్పరి ఈరన్న ఇంటి నుంచి పూర్ణకుంభాన్ని మేళతాళాలతో ఊరేగింపుగా తీసుకొచ్చి రథానికి పూజలు చేశారు. అనంతరం ఉత్సవమూర్తిని, ఆలయ పీఠాధిపతులు బసవలింగమ్మవ్వను రథం వద్దకు తీసుకొచ్చి ప్రత్యేక పూజలు చేపట్టారు. గంగాభవానీ ఉత్సవ మూర్తిని రథంపై అధిష్టించి మేళతాళాలు, సన్నాయి వాయిద్యాలు, కరతాళ ధ్వనుల మధ్య ఆడపడుచులు కలశాలతో స్వాగతం పలుకుతుండగా రథం ముందుకు కదిలింది. తేరుబజారు నుంచి బసవన్న గుడి వరకు రథాన్ని లాగి తిరిగి యథాస్థానానికి చేర్చారు. ఎంపీపీ శ్రీవిద్య, వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు రామ్మోహన్‌రెడ్డి, గొర్రెల ఫెడరేషన్ డైరెక్టర్ ఎల్లప్ప ప్రత్యేక పూజలు చేసి మొక్కులు తీర్చుకున్నారు.

కర్ణాటక భక్తుల పాదయాత్ర

గంగాభవాని రథోత్సవం పురస్కరించుకొని కర్ణాటక రాష్ట్రం, రాయచూర్ జిల్లాకు చెందిన అమీన్‌గడ, పోత్‌నాళ్, ఆనూరు, మాన్వీ తదితర గ్రామాల భక్తులు రెండు రోజుల ముందు నుంచే బాపురం గ్రామానికి పాదయాత్రగా బయలుదేరి శుక్రవారం రథోత్సవంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు.

ఆస్పరిలో ఫ్లాగ్ మార్చ్



కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

ఆస్పరి: ప్రజల భద్రతకు భరోసా కల్పించేందుకు గురువారం ఆస్పరి సీఐ హనుమంతప్ప ఆధ్వర్యంలో మండలంలోని ఆస్పరి, నగరూరు, హలిగేర, బిల్లేకల్లు, ముత్తుకూరు, వలగొండ గ్రామాలలో స్థానిక పోలీసులతో కలిసి కేంద్ర సాయుధ బలగాలు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించాయి. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో ఎక్కడా అల్లర్లు జరగకుండా చర్యలు తీసుకుంటున్నామన్నారు. ప్రతి గ్రామంలో ఓటు హక్కు వినియోగంపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామన్నారు. ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు అన్ని పార్టీల ప్రతినిధులు, ప్రజలు సహకరించాలని కోరారు.

కర్ణాటక మద్యం స్వాధీనం



నిందితుల అరెస్ట్ చూపుతున్న ఎస్ఐ మహమ్మద్ రిజ్వాన్

చిప్పగిరి: మండలంలో గురువారం నిర్వహించిన ఆకస్మిక దాడులలో.. రెండు ద్విచక్ర వాహనాలలో కర్ణాటక నుంచి చిప్పగిరికి అక్రమంగా మద్యం తరలిస్తున్న చిప్పగిరికి చెందిన ధనుంజయ్య, సతీష్, రవి, పవన్ కల్యాణ్‌ను అరెస్ట్ చేసినట్లు ఎస్ఐ మహమ్మద్ రిజ్వాన్ తెలిపారు. నిందితుల నుంచి 2,880 హైవార్డ్ విస్కీ (90 ఎంఎల్) మద్యం టెట్రా ప్యాకెట్లు, రెండు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు చెప్పారు. పోలీస్ సిబ్బంది యశ్వంత్, రామోజీ, భాస్కర్ షబ్బీర్, అహమ్మద్ తదితరులు పాల్గొన్నారు.

హొళగుంద: కర్ణాటక నుంచి అక్రమంగా మద్యం తీసుకొచ్చి గజ్జహళ్లి గ్రామంలో విక్రయించేందుకు వామదొడ్డిలో నిల్వఉంచిన రెండు మద్యం బాక్సుల (192 టెట్రా ప్యాకెట్ల)ను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పెద్దయ్యనాయుడు గురువారం విలేకరులకు తెలిపారు. మద్యం విక్రేత పరారీలో ఉన్నాడని, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెల్లడించారు.

ఓబులేసు స్వామి కల్యాణ వైభోగం



ఓబులేసు స్వామి, చెంచులక్ష్మి, ఆదిలక్ష్మి ఉత్సవ విగ్రహాలకు కల్యాణం నిర్వహించిన గ్రామ పెద్దలు

ఆస్పరి: మండలంలోని తొగలుగల్లు గ్రామ సమీపంలోని కొండల్లో వెలసిన ఓబులేసుస్వామి, చెంచులక్ష్మి, ఆదిలక్ష్మిల కల్యాణోత్సవం గురువారం కనులపండువగా జరిగింది. ఆలయంలో పూజారి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో స్వామి, అమ్మవార్లకు గంగపూజ, పంచామృతాభిషేకం, పల్లకీసేవ, మంగళహారతులు తదితర కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి వారి కల్యాణోత్సవం తరువాత గ్రామంలో ఉత్సవ విగ్రహాలను భక్తులు ఊరేగించారు. మండలంలోని ఆస్పరి, తంగరడోణ, యాటకల్లు, దొడగొండ, బైలుపత్తికొండ, కైరుప్పల, డీకోటకొండ తదితర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. స్వామివారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకున్నారు. శుక్రవారం తెల్లవారుజామున స్వామివారి పల్లకీ ఊరేగింపు,ప్రభోత్సవం జరగనున్నట్లు గ్రామ పెద్దలు తెలిపారు.